సేంద్రియ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం: మంత్రి తుమ్మల




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

కాకతీయ ప్రభుత్వ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలు




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 07 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 04 జనవరి 2026


# కొండగట్టు అంజన్న.. నా ప్రాణదాత



**• స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు**

**• పలు అభివృద్ధి పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన**

**జగిత్యాల,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం పవన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ. 35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా మిగతా2లో...

# కృష్ణానది ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియాలి

**సభలో చర్చకు రాకుండా తప్పించుకున్న బిఆర్ఎస్**

**సభకు వచ్చి సలహాలు ఇవ్వాల్సిన కెసిఆర్ ఎక్కడ..?**

**పార్టీ కార్యాలయాల్లో కాదు..సభకు వచ్చి మాట్లాడాలి**

**శాసనసభలో 'నీళ్లు-నిజాలు'పై జరిగిన చర్చలో సిఎం రేవంత్**



**హైదరాబాద్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** కృష్ణానది ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంలో మాట్లాడాల్సిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేల సభకు గైర్హాజరు కావడం దారుణమని సిఎం అన్నారు. శాసనసభలో 'నీళు -నిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో భాగంగా సీఎం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత పదేళ్లలోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం జరిగింది. ఎంతో అనుభవం ఉన్న మిగతా2లో...



# ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

**ఎదురు కాల్పుల్లో 12మంది నక్సల్స్ హతం**

**రాయపూర్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మిగతా2లో...

# బిఆర్ఎస్ హయాంలో ఎపి కృష్ణాజలాల జలదోపిడీ

**శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా తరలింపు**

**రోజుకు 13 టిఎంసిల నీరు తరలించుకుపోయిన ఎపి**

**పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోని బిఆర్ఎస్**

**చోద్యం చూస్తూ కూర్చున్న నాటి సిఎం కెసిఆర్**

**కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ హయాంలోనే ఎపి నీటి దోపిడీ జరిగిందని, అందుకు నాటి సిఎం కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మిగతా2లో...



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**- గత పదేళ్లలో ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం**
**- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి**

**హైదరాబాద్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చెల్లించిన బిల్లులలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్నారు. మిగతా2లో...

# పేదలకు అండగా నిలవడమే సర్కార్ లక్ష్యం

**• అర్హులందరికీ గృహ జ్యోతి పథకం వర్తింపు**

**• అసెంబ్లీలో డిప్యూటీ సిఎం భట్టి వెల్లడి**




**హైదరాబాద్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ గృహ జ్యోతి వర్తిస్తుందన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలోని వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు మిగతా2లో...

# ఆనాడు విపక్షంలో అన్నదేమిటి.. ఇప్పుడు చేస్తున్నదేమిట..?

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరు కామనలేదా..?**

**నాటి ఉత్తమ్ లేఖను బయటపెట్టిన హరీష్ రావు**



**హైదరాబాద్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. మిగతా2లో...

# మావోయిస్ట్ అగ్రనేత బర్సే సుక్కా లొంగుబాటు



**ఆయుధాలు,**

**డబ్బును అప్పగించిన మావోయిస్టులు**

**డిజిపి శివధర్ రెడ్డి ముందు లొంగుబాటు**

**హైదరాబాద్,03 (పిసిడబ్ల్యూ న్యూస్):** మావోయిస్టుల లొంగుబాటు కొనసాగింది. మరికొందరు అగ్రనేతలు లొంగుబాటు పట్టారు. అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది మిగతా2లో...



# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

**- ఏపీ బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్**

**హైదరాబాద్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** - డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్ కావడం సంచలనం సృష్టిస్తోంది. కడప జిల్లా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డిని తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ తీసుకుంటుండగా అతడు పట్టుబడినట్లు మిగతా2లో...

# కూనంనేనివి దివాళాకోరు రాజకీయం

**• మోడీపై వ్యక్తిగత విమర్శలపై మండిపాటు**

**• ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి విమర్శలు**



**హైదరాబాద్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** మోదీపై ఎమ్మెల్యే కూనంనేని వ్యాఖ్యలు రాజకీయ దివాళా కోరుతనాన్ని బయటపెట్టాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని చెప్పుకొచ్చారు. అంతేకానీ ప్రధానమంత్రిపై వ్యక్తిగత ధూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దుర దృష్టకరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు హేయమైనవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికై, దేశాభి వృద్ధికి అహోరాత్రులు కష్టపడుతూ

మిగతా2లో...

# బిఆర్ఎస్ హయాంలో ఎపి కృష్ణాజలాల జలదోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రానికి ఫిర్యాదు చేశాం. పనులు నిలిపివేయించాం. 2024-25 సీజన్‌లో కృష్ణా జలాల్లో ఎక్కువ నీటిని వాడుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉంది. మేం వచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించాం. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని ఉత్తమ్ తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు.. పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే.. మళ్లీ ఆఫ్ చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి.. పాలమూరును నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేది. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లం. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయింది. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారు. ప్రాణహిత - చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేది. 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లం. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగింది. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చిందని ఉత్తమ్ వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు. పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు.

# కృష్ణానది ప్రాజెక్టులపై ప్రజలకు వాస్తవాలు తెలియాలి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ సీఎం సభకు వచ్చి సలహాలు, సూచనలు ఇస్తారనుకున్నా. కేసీఆర్.. నదీ జలాల గురించి మాట్లాడితే రాష్ట్రానికి ఉపయోగపడే సలహాలు చెప్తారనుకున్నా. సభల్లో మాట్లాడిన దానికంటే.. అసెంబ్లీలో మాట్లాడే మాటలకు విలువ ఉంటుంది. రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రాకపోవటం విచారకరం. గతంలో భారత రాష్ట్ర సమితి నేతలు అవమానించినా.. కాంగ్రెస్ నేతలు సభకు వచ్చి మాట్లాడేవారు. ప్రతిపక్ష నేతలు అసెంబ్లీలో మాట్లాడకుంటే .. అంతిమంగా ప్రజలకే అన్యాయం జరుగుతుంది. కృష్ణా జలాలపై చర్చను తెరపైకి తెచ్చిందే ప్రతిపక్ష నేత కేసీఆర్. పార్టీ కార్యాలయాల్లో మాట్లాడితే ప్రజల్లో గందరగోళం నెలకొంటుంది. అందుకే కేసీఆర్ మాట్లాడిన వెంటనే అసెంబ్లీలో చర్చ చేపట్టాం. కానీ, ఆయన మాత్రం సభకు రాలేదు. చట్టసభలంటే వారికి చిన్న చూపు‘ అని సీఎం అన్నారు. శాసనసభకు రాకుండా గులాబీ పార్టీ నేతలు తప్పించుకుతిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బహిరంగ సభల్లో మాట్లాడటం కాదని.. సభకు రండి నిజాలు ఏంటో తేలుద్దామని సవాల్ విసిరారు. అసెంబ్లీలో కృష్ణా నది జలాలపై చర్చ పెట్టమని తాము అడగలేదని ప్రస్తావించారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ అడిగారని చెప్పుకొచ్చారు. అందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కృష్ణా నదీ జలాలపై చర్చిస్తున్నామని స్పష్టం చేశారు.కేసీఆర్ సభకు ఎందుకు రాలేదో కారణమే లేదని అన్నారు. హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చారని.. అయినా తాము సభకు రామని వెళ్లిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని తమను కోరారని.. అయితే మీ బట్టలు ఊడదీస్తామని ఒకరు, తోలు తీస్తామని మరొకరు మాట్లాడారని.. ఇప్పుడేమో కుంటిసాకులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సభకు వచ్చి చర్చలో పాల్గొంటే ఎవరి బట్టలు ఎవరు ఊడదీయాలో ప్రజలే తేల్చేవారని అన్నారు. ప్రాజెక్టులపై నిలదీస్తామన్న కేసీఆర్ సభకు ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు సీఎం రేవంత్‌రెడ్డి. సభకు వచ్చి కేసీఆర్ దగ్గర ఉన్న సమాచారం ప్రభుత్వానికి ఇస్తారనుకున్నామని.. కానీ అసెంబ్లీకి ఎందుకు రావట్లేదో కారణం చెప్పాలని నిలదీశారు. కేసీఆర్ సూచనలు ఇస్తే తీసుకుందామని తాము అనుకున్నామని తెలిపారు. కృష్ణానీటిపై ఒకరోజు, గోదావరి నీటిపై మరో రోజు చర్చ పెట్టాలని అనుకున్నామని చెప్పారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సభకు వచ్చి కేసీఆర్ అనుభవాలు తమతో పంచుకోవాలని తాను పదేపదే ఆయన్ను కోరుతున్నామని అన్నారు. గతంలో మాజీ మంత్రి జానారెడ్డి, మల్లు భట్టి విక్రమార్క పోషించిన పాత్ర పోషించాలని తాము కోరామని తెలిపారు. జానారెడ్డి, భట్టిలను ఆనాడు అవమానించినా భరించి సభకు వచ్చి సలహాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

# పేదలకు అండగా నిలవడమే సర్కార్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. ప్రధానంగా గృహ జ్యోతి పథకం, ఇంద్రమ్మ ఇళ్లు, వ్యవసాయ పథకాలు, సోయా కొనుగోలు వంటి ముఖ్య సమస్యలపై చర్చలు జరిగాయి. ముందుగా గృహ జ్యోతిపై ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగరాజు పలు ప్రశ్నలు సంధించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకం కొనసాగింపుపై సభలో డిప్యూటీ సీఎం స్పష్టతనిచ్చారు. కొత్త దరఖాస్తులు, మార్పులు ? చేర్పులకు ప్రజా పాలన కార్యాలయాల్లో అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 52.82 లక్షల కుటుంబాలకు గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గృహ జ్యోతి కోసం ఇప్పటి వరకు రూ.3,593 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లింపులు చేసిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వ్యవసాయం రంగంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానిమిస్తూ.. వ్యవసాయ రంగంలో ఆగిన పథకాలను పునరుద్ధరణ చేపడుతున్నామని చెప్పారు. సోయాను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా, కేంద్రం కొనడం లేదని అన్నారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి సూచించారు.

# కూనంనేనివి దివాళాకోరు రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ గౌరవాన్ని దార్శనిక నాయకుడు మోదీ పెంచుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రజాప్రతినిధి అయిన కూనంనేని.. అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు కిషన్‌రెడ్డి. ప్రజలు అన్నింటినీ గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలతో వారికి ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని తెలిపారు. మోదీపై వ్యాఖ్యలకు గానూ కూనంనేని సాంబశివరావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంపై వెంటనే జోక్యం చేసుకుని మరెవరూ.. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

# మావోయిస్ట్ అగ్రనేత బర్సే సుక్కా లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు భారీగా ఆయుధాలు, నగదు అప్పగించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నిన్ననే లొంగిపోగా.. ఆ వివరాలను డీజీపీ శనివారం మీడియాకు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా ఆర్మీ చీఫ్‌గా దేవా పని చేస్తున్నారు. లొంగిపోయిన వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ లొంగుబాటు పీఎల్‌జీఏకు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు చెప్పారు. దేవా.. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడు. ఎన్ఐఏ నుంచి దేవాపై రూ.75లక్షల రివార్డు ఉంది. ఆవులం సోమా, భేమే, సుశీల, వేముల రాజు, నందయ్యా, మంకు, అండా, తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యురాలు అడ్లూరి ఈశ్వరి లొంగిపోయినవారిలో ఉన్నారు. 2 పెట, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధంతో వచ్చారు. ఇజ్రాయెల్ దేశంలో తయారు చేసిన టవర్ ఆయధం కూడా ఉంది. ఎనిమిది ఏకే 47 గన్స్ స్వాదీనం చేసుకున్నాం. 8, నాలుగు బ్యారేల్ గ్రానైడ్ లాంచర్స్ ఆయుధాలను సమర్పించారు.

హెలికాప్టర్‌ను సైతం కూల్చే భారీ ఆయుధం సైతం తీసుకు వచ్చారు. పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 66 మంది మాత్రమే మిగిలారు. పీఎల్‌జీఏ పూర్తిగా క్షీణించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కిష్టంపేట్‌కు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా రాష్ట్రానికి చెందిన ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో మావోయిస్టులు ఆత్మ సమర్పణ చేసుకున్నారు. డివిజన్ సభ్యులకు రూ.5లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4లక్షలు, తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఇస్తాం. ఇప్పటి వరకు తెలంగాణలో 576 మంది మావోయిస్టులు లొంగిపోయారు. కోరుతున్నాం అని డీజీపీ తెలిపారు.

# కొండగట్టు అంజన్న ..నా ప్రాణదాత

(మొదటి పేజీ తరువాయి)

బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది‘ అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో పామ్లూరు గ్రామం సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు.. బీజాపుర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా.. గత ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మందికిపైగా మావోయిస్టులు మృతి చెందారు ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్ మృతి చెందినట్టు తెలుస్తోంది. సుక్మా జిల్లాలో తెల్లవారుజామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ స్థాయిలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నాయి. నక్సలైట్ల సంచారం ఉన్నట్టు సమాచారం అందడటంతో జిల్లాకు చెందిన రిజర్వ్ గార్డ్ పోలీసుల బృందం ఈ తెల్లవారుజామున రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే నక్సల్స్, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే, నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న సమాచారంతో తెలంగాణ పోలీసుల ప్రత్యేక విభాగమైన ‘ఈగల్ టీం‘ ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో సుధీర్ రెడ్డి డ్రగ్స్ తీసుకుంటుండగా పట్టుబడినట్లు సమాచారం. వెంటనే అతనికి అక్కడికక్కడే డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు చేయగా, ఫలితం పాజిటివ్‌గా వచ్చింది. దీంతో పోలీసులు సుధీర్ రెడ్డిని అరెస్ట్ చేశారు.అరెస్ట్ అనంతరం అతడిని నార్సింగి పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తోంది. సుధీర్ రెడ్డిని డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. సుధీర్ రెడ్డి తండ్రి ఆదినారాయణ రెడ్డి ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. గతంలో ఆయన టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

# ఆనాడు విపక్షంలో అన్నదేమిా.. ఇప్పుడు చేస్తున్నదేమిటి..?

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోమని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు. అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం విచారణ జరుగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో విమర్శలు చేశారు. తమ నియోజకవర్గాల్లో బిల్లులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని, టెక్నికల్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇస్తున్న ఇండ్లతో పాటు అదనపు ఇండ్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరారు.రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేసిందని.. 20 లక్షల మంది లబ్దిదారులను గుర్తించామని.. ఆగిపోయిన ఇళ్లకు నిధులిచ్చి పూర్తీ చేస్తున్నామని అన్నారు గత పాలకులు పదేళ్లు కమిషన్ల కోసమే పనిచేశారని.. పదేళ్లలో ఇళ్ళు పూర్తీ చేసి ఉంటే పేదలకు ఇబ్బంది ఉండేది కాదని అన్నారు పొంగులేటి.పదేళ్లు కమిషన్లు తీసుకొని అరకొర ఇళ్ళు ఇచ్చారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక చెంచులందరికీ మొదటి విడతలోనే ఇళ్ళు మం జూరు చేశామని అన్నారు గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ఇందిరమ్మ ఇండ్లే కనిపిస్తున్నా యని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలు గుర్తిస్తున్నామని అన్నారు.పేదల ఆత్మగౌర వానికి సంబంధించిన ఇండ్ల నిర్మాణంలో రాజీపడం అని.. అర్హులందరికీ తప్పకుండా ఇండ్లు ఇస్తామని అన్నారు పొంగులేటి.

# సేంద్రియ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం: మంత్రి తుమ్మల

**హైదరాబాద్,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి సముచిత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. మండలిలో ఆయన ప్రశ్నరలకు సమాధానం ఇస్తూ..కేంద్రం సైతం ఈ సేద్యాన్ని ప్రోత్సహించేందుకు పలు పథకాలు తీసుకొచ్చిందని.. అయితే, గత భారాస సర్కారు హయాంలో కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల తెలంగాణలో సేంద్రియ సాగు సరిగా జరగలేదన్నారు. భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం కింద గత సంవత్సరం రూ.95 కోట్లు చెల్లించామని, ఈ సారి పరిహారాన్ని త్వరలో రైతుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. రాష్ట్రంలో యాప్ ద్వారా రైతులందరికీ యూరియా సక్రమంగా అందుతోందని తుమ్మల వివరించారు. యాప్ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లు విజయవంతమయ్యాయని, అదే తరహాలో యూరియాకూ యాప్ తెచ్చామన్నారు. భారాస సభ్యులు దాసోజు శ్రవణ్‌కుమార్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈ మేరకు బదులిచ్చారు.

# సావిత్రిబాయి పూలే ఆశయాలు నేటికీ నెరవేరలేదు





**మహబూబ్‌నగర్, జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** సావిత్రిబాయి పూలే ఆశయాలకు 195 సంవత్సరాలు గడిచినా మహిళా అభివృద్ధి పూర్తిస్థాయిలో సాధించబడలేదని చైతన్య మహిళా సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ బాలికల జూనియర్ కాలేజీలో చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కోకన్వీనర్ కస్తూరి అధ్యక్షత వహించారు.సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కరుడుగట్టిన భూస్వామ్య వ్యవస్థలు, బ్రాహ్మణీయ ఆధిపత్యం ఉన్న కాలంలోనే బాలికలకు, ముఖ్యంగా దళిత బాలికలకు విద్యను అందిస్తూ అనేక పాఠశాలలను స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.లైంగిక దాడులకు గురైన బ్రాహ్మణ వితంతువులకు ఆశ్రయం కల్పించి, పురుడు పోసి ప్రాణాలను కాపాడిన మానవతామూర్తిగా ఆమె చరిత్రలో నిలిచారని తెలిపారు. అనాథ బాలలను ఆదరించడమే కాకుండా స్వయంగా ఒక అనాథ బాలుడిని పెంచి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. బాల వితంతువులపై అమానుషంగా అమలైన క్షవరం వంటి సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉద్యమించారని తెలిపారు.జ్యోతిబా పూలే ఆశయాలను జీవితాంతం కొనసాగించిన ధీరవనిత సావిత్రిబాయి పూలే, చివరికి ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తూ 1895లో ప్రాణాలు కోల్పోయిన అమరురాలిగా నిలిచారని నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కోకన్వీనర్ కస్తూరి, చంద్రకళ, రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. చివరగా సావిత్రిబాయి సింధు, వందన పాట పాడి కార్యక్రమాన్ని ముగించారు.

# ఖాదిమానే మిల్లత్‌కు అండగా తోడ్పాటునందిస్తాం...







**- వితంతువులకు పెన్షన్లు, పేదలకు బ్లాకెంట్లను పంపిణీ చేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**- ఖాదిమానే మిల్లత్ 2026 క్యాలెండర్ (కాలమాని) ఆవిష్కరణ**

**కరీంనగర్,జనవరి03(పీసీడబ్ల్యూ న్యూస్):**నగరంలోని ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ అయినటువంటి ఖాదిమానే మిల్లత్ కరీంనగర్ కు అండగా ఉండి రాష్ట్ర ప్రభుత్వం తరఫున తోడ్పాటునందిస్తామని, ఖాదిమానే మిల్లత్ సంస్థ కరీంనగర్ వేదికగా కుల, మతాలకతీతంగా చేస్తున్న సేవలు అభినందనీయమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని రాజీవ్ చౌక్ లో గల అస్లమీ సిటీ సెంటర్ కాంప్లెక్స్ లో ఖాది మానే మిల్లత్ కార్యాలయంలో వితంతువులకు పెన్షన్లు పేదలకు చలి బ్లాన్కెట్లను పంపిణీ చేసిన అనంతరం సంస్థ 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా చలికాలం పేదలకు బ్లాంకెట్లను పంపిణీ, దివంగత సమద్ నవాబ్ స్వంత డబ్బుతో, తన తల్లి పేరిట జ్ఞాపకార్థంగా గత కొద్ది సంవత్సరాల నుండి ప్రతి ఏటా పేదలకు చలికాలం దృష్ట్యా బ్లాంకెట్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఆయన భౌతికంగా లేకున్నా ఆయన కుమారుడు సంస్థ తరఫున బాధ్యతలు చేపట్టి నవాబ్ భాయి ఆశయ సాధనకు కృషి చేయడం సంతోషదయకమన్నారు. ఖాదిమానే మిల్లత్ సేవా సంస్థ ద్వారా పేద రోగులకు వైద్య సదుపాయం, ప్రతినెల వితంతువులకు పెన్షన్లు, నిరుపేద ఖైదీలను జైలు నుంచి విడిపించడానికి న్యాయ సహాయం, ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే నిరుపేద విద్యార్థులకు విద్యాపరమైన నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్, పలకలు, బ్యాగులు వంటివి సమకూర్చడం, అనాథల అంత్యక్రియలకు ఏర్పాటు చేయడం, పేదలు తమ కాళ్లపై నిలబడి బ్రతికేలా వారి జీవనోపాధి కోసం ఉచితంగా టైలరింగ్ సెంటర్ ఏర్పాటు, పేద, మధ్యతరగతి వ్యాపారుల కోసం వడ్డీ లేని రుణాలను అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. ఖాదిమానే మిల్లత్ కు ప్రభుత్వ పరంగా తగిన గుర్తింపును ఇచ్చి సంస్థ కార్యకలాపాలు విస్తరణ కోసం తన వంతు శక్తివంచన లేకుండా సాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఖాధిమానే మిల్లత్ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ అంజదుల్లా బేగ్, ఫసి, ఖురేషి, సమద్ నవాబ్ కుమారులు, అబ్దుల్ అహద్ నవీద్, అబ్దుల్ అలీం నవాజ్, సోదరులు సలీం సాజిద్, సాలార్ వాజిద్, ఆఫ్రిది తదితరులు పాల్గొన్నారు.

# సభకురారు స్పందించరు

**పోరాడాల్సిన అసెంబ్లీ సభ వాకౌట్ చేయడంపై మండిపడ్డ టీడీపీ నేత వాసిరెడ్డి భాస్కరరావు**

**ఖమ్మం ప్రతినిధి, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టిఎన్టియుసి తెలంగాణ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కర రావు, విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల తరఫున అసెంబ్లీలో మాట్లాడమని ప్రజలు మిమ్మల్ని గెలిపిస్తే 4 కోట్ల ప్రజల ఆశలపై నీళ్ళు చల్లి అసెంబ్లీ వాకౌట్ చేయడంపై బిఆర్ఎస్ పార్టీ నాయకుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా నేను లేస్తే ఒకలెక్క అంటూ ఫామ్ హౌజ్ లో విలేకరుల సమావేశం పెట్టడం ఏంటి, దేనికి భయపడుతున్నారని అంటూ మైకు పడితే చాలు చంద్రబాబు జపం చేస్తూ మళ్లీ తెలంగాణలో తెలంగాణ సెంటిమెంట్ రాజేసి మాయ మాటలతో తెలంగాణ ప్రజలను మళ్లీ రెచ్చగొడుతూ తమ పార్టీని బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు, కృష్ణానది జలాల పంపిణీ, నీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణ నీళ్లు చంద్రబాబుకు దోచిపెడుతుండనీ, చంద్రబాబు శిష్యుడని చంద్రబాబు పాలన నడుస్తుందని తెలుగుదేశంపార్టీపై అక్కస్సుతో ప్రజలను పక్కదోవ పట్టిచ్చే విధంగా ఫామ్ హౌస్ లో చెప్పడం కాదు, అసెంబ్లీకి వచ్చి సభలో 4 కోట్ల తెలంగాణ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవకాశం వచ్చినప్పుడు సమాధానం చెప్పాల్సింది పోయి అసెంబ్లీకి రాకుండా మీ నాయకులు కేటీఆర్, హరీష్ రావు లు, సభను వాకౌట్ చేసి ఎందుకు పారిపోయారని అని ప్రశ్నించారు. మీరు కాదా జగన్ తో దోస్తీ కట్టి ఆంధ్రాని బాగు చేస్తా అంటూ తిరిగింది. రోజా ఇంట్లో తిన్న చేపల పులుసు తెలంగాణ ప్రజలకు వాసన వస్తూనే ఉంది అని ఎద్దేవా చేశారు. తమ కుటుంబం మొత్తం దోపిడీ చేయనప్పుడు అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పే బాధ్యత మీకు లేదా అని గుర్తు చేశారు. కెసిఆర్ నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వెళ్లి ప్రసంగించాలని అన్నారు. మీ కూతురు కవిత సభకు వచ్చి సమాధానం చెప్పాలని రాకుంటే మీ పార్టీని దేవుడు కూడా కాపాడలేదని అన్నారుగా నిజంగానే తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. మీ తప్పులను ఒక్కొక్కటిగా మీ కూతురే బహిర్గతం చేస్తుంది. ఇక తెలంగాణలో మీ పార్టీ మనుగడ ఉండదని అన్నారు. చంద్రబాబు పై




తెలుగుదేశంపార్టీ పై అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని బూటకపు ఆరోపణలు మానుకొని ప్రతిపక్ష హోదా నిలుపుకొని సభలో మాట్లాడి ప్రభుత్వంతో పనిచేయించుకోవాలని అన్నారు. లేకుంటే తెలంగాణలో మీ పార్టీ లేకుండా పోయేది ఖాయమని అన్నారు.

# పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపిన తోలుపునూరి కృష్ణ గౌడ్

**అంబర్ పేట డిసెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకొని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి సీతక్క కు శుభాకాంక్షలు తెలిపిన పిసిసి ప్రధాన కార్యదర్శి నాగభూషణం, పీసీసీ కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, శ్రీకాంత్ నేత, ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఎన్ని మాటలు మాట్లాడినా ప్రజలు నమ్మే పరిస్థితులో లేరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి కి సాటి ఎవరూ లేరని ఈ సందర్భంగా అన్నారు.



# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు







**హనుమకొండ :జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రి బాయ్ పూలే జయంతి ఉత్సవాలు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ గారి నే తృత్వంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ప్రిన్సిపాల్ పూలే దంపతులకు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు.దేశంలో మహిళా విద్యను మొదలు పెట్టిన ఆదర్శనీయులు పూలే దంపతులని కొనియాడారు. మహిళలకు విద్యనందించి సావిత్రిబాయి పూలే దేశంలోనే తొలి మహిళా టీచర్ గా పెరుగడించింది అన్నారు. మహిళా విద్య కొరకై పాటుపడిన సావిత్రి భాయ్ జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమని కొనియాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, స్టాఫ్ సెక్రటరీ రవికుమార్, డాక్టర్ వెంకన్న, డాక్టర్ దినకర్, మరియు ఐక్యూసఏసీ కోఆర్డినేటర్ డా. శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం డాక్టర్ గన్సింగ్ డాక్టర్ సీతారాములు డాక్టర్ సంధ్యారాణి,డాక్టర్ జి. శ్రీనివాస్ ఎన్సిసి ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆఆర్డినేటర్ డా.కోమల డా.ఇందిరా దేవి, డా కవిత డా.సమత ఎగ్జామినేషన్ కంట్రోలర్ డా. శివ నాగ శ్రీను డాక్టర్ కిషోర్ కుమార్ డాక్టర్ సమ్మయ్య గారు ,ఇతర విభాగాల అధిపతులు సీనియర్ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంజీఎం రేడియోగ్రాఫర్ ఉద్యోగ విరమణ సందర్భంగా, సన్మానించిన ఉద్యమ నేత దామోదర్





**హనుమకొండ, జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):**స్థానిక మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్‌లో ఇటీవల రేడియో గ్రాఫర్ గా గత 40 సంవత్సరాల నుండి సేవలందించినటువంటి పాకాల యాకయ్య గారి ఉద్యోగ విరమణ సందర్భంగా కేయూ జేఏసీ చైర్మన్, బీసీ రాష్ట్ర నాయకులు కత్తెరపల్లి దామోదర్, ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతభత్యాలు తీసుకోవడమే కాకుండా ప్రజల సేవలో అంకితమై సామాజిక స్పృహతో సేవ చేయాలని అలాంటి వ్యక్తిత్వం ఉన్నటువంటి పాకాల యాకయ్యా గారు ఎనలేని వైద్య సేవలు చేయడం జరిగింది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో గాయాలపాలైనటువంటి విద్యార్థి ఉద్యమకారులను సైతం తన కుటుంబ సభ్యుల లాగా తన బృందం సహకారంతో సేవలందించడం మరువలేదని ఈ సందర్భంగా అన్నారు. గతంలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా , అదేవిధంగా తెలంగాణ స్టేట్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకునిగా కూడా సేవలు అందించడం గర్వించదగ్గ విషయమని దామోదర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా నాయకులు సముద్రాల శ్రావణ్ కుమార్, మెడికల్ అసోసియేషన్ నాయకులు, ఎస్ విజయ్, ఎన్.వి. మోహన్, లాయిక్ అహ్మద్, పి. శ్రీకాంత్ రెడ్డి , గజ్జి సంతోష్, కిషోర్, కార్తీక్, కిరణ్ తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు

# శ్రీ సాయితేజ తిరుమల వైన్ షాప్ చుట్టూ బెల్ట్ షాపుల మాఫియా!

**యూత్ భవిష్యత్తుతో చెలగాటం... అధికారుల మౌనం ఎందుకు?**





**ములుగు జిల్లా,జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాటాపూర్ మండలంలో ఉన్న శ్రీ సాయితేజ తిరుమల వైన్ షాప్ పరిసర ప్రాంతాల్లో అక్రమ బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. చట్టాలకు చెల్లుచెప్పకుండా, అధికారుల కన్నుకప్పి ఈ దందా యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఎమ్మార్పీ పేరుతో దోపిడీప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలను తుంగలో తొక్కుతూ, ఒక్కో బాటిల్‌పై ₹20 నుంచి ₹30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని స్థానికుల ఆగ్రహం.అంతేకాదు, వైన్ షాప్ తెరవకముందే బెల్ట్ షాపులకు మద్యం సరఫరా జరగడం సంచలనంగా మారింది. వీధుల్లోనే మద్యం అందుబాటులోకి రావడంతో అక్రమ వ్యాపారం బహిరంగ రహస్యంగా మారింది. ఆరోగ్యానికి ముప్పు నకిలీ మద్యం భయంకొన్ని ప్రాంతాల్లో మద్యం పేరుతో నాసిరకం / నకిలీ మద్యం విక్రయం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మత్తు పానీయాలు తాగడం వల్ల యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూత్ మద్యం బానిసత్వం భవిష్యత్తుకు అంధకారం18 నుంచి 25 ఏళ్ల యువత మద్యం మత్తుకు బానిసలై, చదువులు ఉద్యోగాలుకుటుంబ బాధ్యతలుఅన్నింటినీ పక్కనపెట్టి మద్యం చుట్టూనే తిరుగుతున్నారని గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది.మందు మత్తులో గొడవలుఅశాంతి రోడ్లపై హంగామారోజురోజుకీ పెరిగిపోతుండటంతో గ్రామ వాతావరణమే కలుషితమవుతోంది. అధికారుల మౌనం ఎందుకు?ఈ అక్రమ బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖఇప్పటికైనా స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.యూత్ జీవితాలతో చెలగాటం ఆడుతున్న మద్యం మాఫియాపై వెంటనే చర్యలు తీసుకోవాలి అని కాటాపూర్ ప్రజలు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరవాలిడ లేకపోతే కాటాపూర్ యూత్ భవిష్యత్తే నాశనం!" స్థానికుల ఆవేదన

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పౌర్ణమి రోజున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం





**గంగాధర, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో కీర్తిశేషులు; పడకంటి వెంకటేశం మరియు సత్తెమ్మ గారి జ్ఞాపకార్ధం కుమారుడు: పడకంటి శ్రీనివాస్ మరియు పద్మ మనుమడు:పడకంటి సంతోష్ కుమార్ మరియు మౌనిక మరియూ కుటుంబ సభ్యులు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి గంగాధర మండల ఆర్యవైశ్య సోదరులందరూ వచ్చి అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి





**హనుమకొండ :జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):**భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి కార్య క్రమాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ రవి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.సావిత్రిబాయి పూలే జయంతి ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించి విద్యా బోధనలో ఉత్తమ పనితీరు కనబరిచిన మహిళా ఉపాధ్యాయినులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వైవి గణేష్, డీఈవో గిరిరాజ్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, విద్యాశాఖ అధికారులు, పాల్గొన్నారు.

## కోడిపందాలు నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు



**తల్లాడ, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తల్లాడ మండల పరిధిలోని పినపాక గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న ఎనిమిది మందిని శుక్రవారం రాత్రి తల్లాడ పోలీసులు కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటకృష్ణ మాట్లాడుతూ కోడిపందాలు నిర్వహిస్తున్న వారి నుంచి 1500 రూపాయలు, 2 పందెం కోళ్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కోడి పందాలను అరికట్టడానికి నిరంతర నిఘా ఉంచి, పండుగల సమయంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## కరీంనగర్ మున్సిపల్ ముసాయిదా ఓటర్ల జాబితాలో లోపాలు

**● మున్సిపల్ కమిషనర్‌కు బిఆర్ఎస్ పార్టీ వినతిపత్రం**







**కరీంనగర్ టౌన్ జనవరి 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ పరిధిలో 01-01-2026న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ నాయకులు గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం (03 జనవరి 2026) సాయంత్రం 4:00 గంటలకు నగర మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం మాజీ డిప్యూటీ మేయర్, నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్లా హరి శంకర్ అన్న నాయకత్వంలో జరిగింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఇంటి నంబర్లు వరుస క్రమంలో లేకపోవడం, ఇతర వార్డులకు చెందిన ఓటర్లు మన వార్డుల్లో చేరడం, ఇంటి నంబర్లు లేని ఓటర్ల నమోదు, జీఓ ఎంఎస్ నెం.144 (21-06-2025) నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల నమోదు, అలాగే అర్హులైన కొంతమంది ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోవడం వంటి లోపాలు ఉన్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ లోపాలను తక్షణమే సరిదిద్దుతూ అర్హులైన ప్రతి ఓటర్ పేరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు మరియు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో ఘనంగా సావిత్రిబాయి పూలే 195వ జయంతి

**బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్**

**నర్సంపేట,జనవరి 03(పిసిడబ్ల్యూ న్యూస్):** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195 వ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని డఫోడిల్స్ హైస్కూల్, బాలాజీ మహిళా డిగ్రీ కళాశాల లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయనీయులతో కలిసి బీసీ సంక్షేమ వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు, డఫోడిల్స్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల నరేందర్ లు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ మహనీయులరాలైన సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించిన ఢఫోడిల్స్ హై స్కూల్ కరస్పాండెంట్ చింతల నరేందర్, బాలాజీ మహిళా కళాశాల అధ్యాపకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సావిత్రిబాయి పూలే దంపతులు 180 సంవత్సరాల క్రితం వేసిన విద్య పునాదులే నేటి మహిళా స్వేచ్ఛకు ప్రధాన కారణం అని కులాల పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే అని అన్నారు. కరస్పాండెంట్ చింతల నరేందర్ మాట్లాడుతూ... మహిళల సాధికారతకు తల్లి సావిత్రిబాయి పూలే నిలువెత్తు రూపం దేశంలో బడుగు బలహీన వర్గాల కు చెందిన మహిళలు చదువుకునేందుకు ఆమె పాఠశాలలు ప్రారంభించి తన భర్తతో కలిసి సత్యశోధక సమాజాన్ని స్థాపించి బాల్య వివాహాలు మూఢ నమ్మకాల నిర్మూలనను రూపుమాపటం కోసం శ్రమించిన వీరనారి సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, డఫోడిల్స్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతల నరేందర్, బాలాజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మోర్తాల రాంరాజ్, బీసీ సంక్షేమ సంఘం చెన్నారావుపేట మండల అధ్యక్షులు బర్ల యాకయ్య, నర్సంపేట మండల నాయకులు నూనె రంజిత్ ముదిరాజ్, శీరంశెట్టి రాజేందర్ పెరక, మారపాక రమేష్ ముదిరాజ్, మహిళా ఉపాధ్యాయనీయులు రీటా, ఇందుమతి, శశికళ, విజయలక్ష్మి, కిరణ్మయి, అనుష, మౌనిక, జుబేదా బేగం, బీసీ సంఘం నాయకులు గుంటుక రాజ్ కుమార్, తడిగొప్పుల ప్రవీణ్, సురేష్, విష్ణు, రవీందర్, సంతోష్, కిషోర్, మధు, రవి కుమార్ లతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

## పొగమంచు కారణంగా రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయకండి

**● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**హనుమకొండ :జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):**వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వాహనదారులు రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారువాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటన చేస్తూ రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదా చారులను గుర్తించడం, వీక్షించే సామర్థ్యం తక్కువుగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలను మానుకోవాలని వరంగల్ సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ్ లైట్లను లో బీమ్‌లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని. పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు వారి గమ్య స్థానాలకు క్షేమంగా చేరుకోవడమే వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రధాన లక్ష్యమని సీపీ వెల్లడించారు.

## సర్పంచ్ ను ఘనంగా సన్మానించిన రేషన్ డీలర్లు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు





**మహబూబాబాద్ ప్రతినిధి, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్ ):** గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో నిరంతరం కృషి చేస్తున్న సీరోల్ మండలం చిలుకోయలపాడు గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్నను గ్రామ రేషన్ డీలర్లు, గిరబోయిన వీరన్న, గుగులోతు రమేష్ లు, అంగన్వాడి టీచర్లు, సూరబోయిన ఉమాదేవి, కొప్పుల అనిత, గూగులోత్ పద్మ ఆశా వర్కర్లు కూరపాటి మంగమ్మ, పిట్టల రమణ, లు శాల్వాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంలో సర్పంచ్ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారంలో సర్పంచు చూపుతున్న చొరవ, గ్రామ సిబ్బందిని ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్న విధానం తమకు ప్రేరణగా నిలుస్తోందని వారు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఊడుగుల వెంకన్న మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధి అనేది ఒక్కరి వల్ల సాధ్యమయ్యే పని కాదని, రేషన్ డీలర్లు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్ల సమిష్టి కృషితోనే ప్రజలకు మెరుగైన సేవలు చేస్తే గ్రామ అభివృద్ధి ను సాధించగలమని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ సంక్షేమం కోసం అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాకూబ్ పాషా, గ్రామ సిబ్బంది, గ్రామ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చర్లబుత్కూరు గ్రామంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు





**కరీంనగర్ జిల్లా జనవరి 03(పిసిడబ్ల్యూ న్యూస్):** సమాజంలో అసమానతల నిర్మూలన కోసం మరియు మహిళల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా ఆజరుపడ్డది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షుడు లింగంపల్లి మోక్షిత్ ఆధ్వర్యంలో చర్లబుత్కూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఆకుల కిరణ్ పటేల్, చీకట్ల సంజీవ్, యూపీఎస్ స్కూల్ హెచ్ఎం భారతి మేడం గారు పాల్గొన్నారు. టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కూర శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నారాయణ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు ప్రత్యేక హాజరు గుర్తించారు.కార్యక్రమంలో లంక వినయ్, మామిడి చెట్టు అఖిల్, తంగళ్ళపల్లి బంటి, నవీన్, లింగంపల్లి వంశీ, బుజ్జేటి కుమార్, చిట్కూరి విజయ్, బైరా అజయ్, లింగంపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే చేసిన మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం చేసే కృషి యువతకు ఆదర్శమని గుర్తు చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలి: హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**● ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్**




**హనుమకొండ :జనవరి 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- ఎస్ ఐ ఆర్) ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులు, బీఎల్ఓలను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ఐసీ హాలులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 2002 ఓటర్ల జాబితాను ప్రస్తుత ఓటర్ల జాబితా తో మ్యాపింగ్ (సరిపోల్చి చూస్తున్న) ప్రక్రియను అధికారుల సమక్షంలో బూత్ లెవెల్ అధికారులు ( బి ఎల్ వోలు) చేస్తుండగా జిల్లా కలెక్టర్ ఈ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గురించి అధికారులు, బిఎల్ఓ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైతే ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో వివరాలను సేకరించి మ్యాపింగ్ చేయాలని సూచించారు. 15 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు, బి ఎల్ ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల గురించి వారికి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, బిఎల్వోలు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు ఎంఐఎం రె"ఢీ"

**● కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా శ్రమించాలి ● ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ 64వ డివిజన్లో అట్టహాసంగా పార్టీ కార్యాలయం ప్రారంభం.. ● పలువురు యువకులు..సీనియర్ సిటీజన్స్ ఎంఐఎంలో చేరిక..**





**కరీంనగర్ టౌన్ జనవరి 03(పిసిడబ్ల్యూ న్యూస్):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీని కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేశామని, ముఖ్యంగా కరీంనగర్ నగర పాలక సంస్థపై ఎంఐఎం జెండా ఎగురవేస్తామని, ఆపార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు నగరంలోని న్యూ ముకరంపురలో 64వ డివిజన్ పార్టీ కార్యాలయాన్ని గులాం అహ్మద్ ప్రారంభించారు. అజీముల్లా ఖాన్, మహమ్మద్ అక్బర్ ఆధ్వర్యంలో ఎంఐఎంలో పలువురు యువకులు, డివిజన్ పెద్దలు స్వచ్ఛందంగా ఎంఐఎం పార్టీలో చేరారు. చేరిన వారికి ఎంఐఎం కండువా వేసి గులాం అహ్మద్ సాధారంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం, ఏరాజకీయ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా, ఎక్కువ స్థానాల్లో పోటీ చేయబోతుందని ప్రకటించారు. కరీంనగర్ లో 20డివిజన్లలో గెలిచి తాము సత్తా చాటుతామన్నారు. గడచిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు, ఓటములను నిర్ణయించే శక్తిగా ఎదిగిన ఎంఐఎం పార్టీ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా, 15 కార్పొరేటర్లు గెలిపిస్తే, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి అభ్యర్థిని ఎంఐఎం నుంచి బరిలో ఉంచుతామని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ చెప్పిన మాటను గుర్తు చేశారు. ఎంఐఎంలో చేరిన వారు టికెట్ ఆశించి రావద్దని పార్టీని బలోపేతం చేయడంతో పాటు, పేద ప్రజల సేవే లక్ష్యంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కృషి చేయాలని, పార్టీలో చేరినటువంటి నాయకులకు హితబోధ చేశారు.ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ ను, 64వ డివిజన్ నాయకులు ఆత్మీయంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నాయకులు బర్కత్ అలీ, హాఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఆతిన, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అజర్ దబీర్, మాజిద్ హుస్సేన్, అంజద్ ఖాన్ అసదుల్లా బేగ్, అజీముల్లా ఖాన్ మహమ్మద్ అక్బర్, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.

# ఎన్నికల డ్రామాలు మొదలుపెట్టిన ఎంఐఎం పార్టీ....

**- కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం ఎన్నికల కోసం కుమ్మక్కయ్యాయి..**

**- కరీంనగర్ మేయర్ పీఠం బిజెపిదే**

**- బిజెపి మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సమీ పర్వేజ్...**



**కరీంనగర్,జనవరి03(పీసీడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల కోసం ఎంఐఎం డ్రామాలు మొదలుపెట్టిందని, కార్పొరేషన్ ఎన్నికల కోసంకాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం ఎన్నికల కోసం కుమ్మక్కయ్యాయనీ బిజెపి మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సమీ పర్వేజ్ ఆరోపించారు. శనివారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి చెందిందంటే కేంద్ర ప్రభుత్వం నిధులతోనని, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తెచ్చిన నిధులతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమైందన్నారు మైనారిటీ డివిజన్ల అభివృద్ధి కూడా బండి సంజయ్ కుమార్ తెచ్చిన నిధులతోనే జరిగిందనే విషయాన్ని మైనార్టీ సమాజం గ్రహించాలన్నారు. కరీంనగర్ రూపురేఖలు మార్చిన ఘనత కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి, పార్లమెంట్ కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కే దక్కుతుందన్నారు. కరీంనగర్ పట్టణంలోని మైనార్టీలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ది జరిగిందని., సుకన్య యోజన స్ట్రీట్ వెండర్స్ లోన్స్ ,పీఎంఈజీబీ లోన్స్, ఉజ్వల యోజన ఇంకా చాలా వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలతో మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందన్నారు.ఎన్నికలు రాగానే కొత్త బిచ్చగాళ్లకు పండుగ అన్నట్టు కరీంనగర్లోని కొన్ని రాజకీయ పార్టీల పరిస్థితి ఉందని ఘాటుగా విమర్శించారు. ముఖ్యంగా ఎంఐఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్ లు మళ్ళీ మైనార్టీలను మోసం చేయడానికి, మరోసారి ఓటు బ్యాంకుగా వాడుకోవడానికి కుట్రలు చేస్తున్నాయన్నారు. మైనార్టీలను అభివృద్ధి చేయాలనే ఆలోచన ఆ మూడు పార్టీలకు లేదని, ఆ మూడు పార్టీలు మైనార్టీల సంక్షేమం అభివృద్ధి కోసం చేసిందేమీ లేదన్నారు.ఎంఐఎం పార్టీకి ఎన్నికలు వచ్చినప్పుడే మైనార్టీ సమాజం గుర్తుకు వస్తుందని, ఆ తర్వాత వారి కష్టాలను బాధలను. ఏ నాడు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎంఐఎం ఎప్పుడూ తన రాజకీయ స్వలాభం కోసమే పాకులాడుతుందని, గతంలో టిఆర్ఎస్ తోటి పొత్తు ఉండి మైనార్టీలను మోసం చేసిందని , నేడు కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని అదేవిధంగా మైనార్టీలను మళ్లీ మోసం చేసే ఆలోచన చేస్తుందన్నారు. మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ మోసం చేస్తున్న ఎంఐఎం పార్టీకి జరగబోయే ఎన్నికల్లో మైనార్టీ సమాజం తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కుల మతాలకతీతంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని, ముఖ్యంగా మైనార్టీ సమాజ అభివృద్ధి సంక్షేమం బిజెపితోనే సాధ్యమైందనే విషయాన్ని మైనార్టీ సమాజం గ్రహించాలన్నారు. మైనార్టీ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేస్తున్న బిజెపికి మైనార్టీలంతా అండగా నిలిచి, జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయానికి దోహదపడాలని ఆయన కోరారు . బిజెపి అభ్యర్థుల గెలుపుతో మైనార్టీ డివిజన్లో అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పై బిజెపి జెండా ఎగురుతుందని, బల్దియా మేయర్ పీఠం కూడా బిజెపి దేనని ఆయన జోస్యం చెప్పారు.

# కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం "సిండికేట్



**● " రజాకర్ వారసుల పార్టీకి కరీంనగర్ అప్పగించడానికి కాంగ్రెస్,బిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం... ● కాంగ్రెస్, బి ఆర్ ఎస్ ల అండ చూసుకొని కరీంనగర్ కార్పొరేషన్ కోసం ఎంఐఎం పగటి కలలు కంటుంది... ● కరీంనగర్లో రామరాజ్య పాలన తెస్తాం, కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరవేస్తాం... ● బిజెపి పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు...**

**కరీంనగర్,జనవరి03(పీసీడబ్ల్యూ న్యూస్):**త్వరలో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల కోసం కాంగ్రెస్, బి ఆర్ ఎస్, ఎంఐఎంలు ఒకటయ్యాయని , కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను కైవసం చేసుకోవాలనే ఆలోచనతో ఆ మూడు పార్టీలు లోపాయికారి ఒప్పందాల తో ముందుకు కొనసాగుతున్నాయని, నగరపాలక సంస్థను ఎంఐఎం చేతిలో పెట్టడానికి కాంగ్రెస్, బి ఆర్ ఎస్ లు రాజకీయాలు చేస్తున్నాయని బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ఆరోపించారు. శనివారం రోజున కొత్తపల్లీ బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి బోయిన్పల్లి ప్రవీణ్ రావ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్పొరేషన్ ఎన్నిక కోసం బీజేపీ నేతలు అనుసరించాల్సిన విధానంపై ప్రవీణ్ రావు మార్గం నిర్దేశనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రజాకర్ వారసుల పార్టీ కాంగ్రెస్, బి ఆర్ ఎస్ లఅండ చూసుకొని కరీంనగర్ కార్పొరేషన్ కైవసం చేసుకుంటామని పగటి కలలు కంటుందని ఎద్దేవా చేశారు. దశాబ్ద కాలంగా కరీంనగర్లో ఎంఐ ఎం కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని, అలాంటి పార్టీ నేడు కరీంనగర్ కార్పొరేషన్ను. కైవసం చేసుకుంటామని ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాటి పాత మిత్రులు బి ఆర్ ఎస్, నేటి కొత్త మిత్రులు కాంగ్రెస్ తో కలిసి, లోపాయికారి కారి ఒప్పందాలతో కార్పొరేషన్ ఎన్నికల కు వెళ్లే ఆలోచనలో ఎంఐఎం ఉందన్నారు. కరీంనగర్ పట్టణ ప్రజలు ఎంతో చైతన్యవంతులని , కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎంల రాజకీయ డ్రామాలను గమనిస్తున్నారని, ఎన్నికల్లో ఆ పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. కరీంనగర్ అభివృద్ధి బిజెపితోనే సాధ్యమని, స్మార్ట్ సిటీతో కరీంనగర్ రూపురేఖలు మార్చిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ చేసిన కృషి కారణంగా వందల కోట్ల నిధులతో కరీంనగర్ పట్టణ రూపురేఖలు మారాయన్నారు. కరీంనగర్ లో రామరాజ్య పాలన తెస్తాం. కరీంనగర్ బల్దియా పై కాషాయ జెండా ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అపస్మారక స్థితిలో ఉన్న మహిళను కాపాడిన 108 సిబ్బంది



**సత్తుపల్లి, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బస్టాండ్ లో మూర్ఛ వచ్చి ( ఫిట్స్) అపస్మారక స్థితిలో ఉన్న మహిళను సత్తుపల్లి 108 సిబ్బంది కాపాడినారు. శనివారం తిరువూరు నుండి రాజమండ్రి కి ప్రయాణమైన మందపల్లి సౌమ్య సత్తుపల్లి బస్టాండ్ చేరుకునే సమయానికి మూర్ఛ వచ్చి బస్టాండ్లో పడిపోయింది. ఆమెను గమనించిన ప్రయాణకులు సత్తుపల్లి 108 సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 సిబ్బంది ఈ ఏం టి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, పైలట్ రాధాకృష్ణ హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పేషంట్ పక్కన అటెండర్స్ ఎవరు లేకపోయినా అంబులెన్స్ లో మెరుగైన వైద్యం అందిస్తూ సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని బస్టాండ్ సెక్యూరిటీ సిబ్బంది ప్రయాణికులు ఖమ్మం జిల్లా 108 సర్వీస్ జిల్లా మేనేజర్ అవులూరి. దుర్గాప్రసాద్, మూడు జిల్లాలను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ అభినందించారు.

## ఘనంగా దయానంద్ జన్మదిన వేడుకలు



**కల్లూరు,జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :**కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పుట్టినరోజు సందర్భంగా సత్తుపల్లిలో వారి నివాస గృహంలో కల్లూరు మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్కినేని కృష్ణ మాట్లాడుతూ నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఈ నియోజకవర్గ ప్రజలకు గ్రామ అభివృద్ధికి సేవ చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూల మాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మేజర్ గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు బైర్ల కాంతారావు,పెద్దబోయిన శ్రీనివాసరావు, రాజబోయిన శ్రీనివాసరావు,తోట సుబ్బారావు,కరుణాకర్ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి



**ఉప్పల్ డిసెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి ,గడ్డం రవికుమార్,తవిడబోయిన గిరిబాబు, ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పై ఎగరవేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని, ఇతర పార్టీల నాయకులు ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఈ సందర్భంగా అన్నారు.

# బాలికల విద్య కోసం సావిత్రిబాయి పూలే పోరాటం నేటి తరానికి ఆదర్శం

**• బహుజన కులాల జేఏసీ నాయకులు పెళ్లూరి విజయ్ కుమార్, దళితరత్న డా. కొరిపల్లి శ్రీనివాస్**





**ఖమ్మం ప్రతినిధి, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** బాలికల విద్య, మహిళా సాధికారత కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం నేటి తరానికి ఎంతో ఆదర్శమని బహుజన కులాల జేఏసీ నాయకులు పెళ్లూరి విజయ్ కుమార్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలోని పూలే ప్రాంగణంలో శనివారం సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమాన్ని బహుజన కులాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెళ్లూరి విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డా. కొరిపల్లి శ్రీనివాస్ పాల్గొని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బాలికలకు విద్య అందించేందుకు ఆమె ఎదుర్కొన్న అవమానాలు, అడ్డంకులు నేటికీ సమాజానికి గుణపాఠమని అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషి అపూర్వమని పేర్కొన్నారు. ఈ జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, విద్యే సమాజ మార్పుకు ప్రధాన ఆయుధమని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు సాధికాళీ, బహుజన కులాల సమన్వయకర్త కత్తి నెహ్రూ గౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పెరుగు వెంకటరమణ యాదవ్, మహాత్మ జ్యోతిరావు పూలే ఐడియాలజీ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెల లక్ష్మీపతి, బహుజన నాయకులు నరేందర్, రాము, సత్యనారాయణ, వెంకన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల చదువుల తల్లి సావిత్రిబాయి పూలే: మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్



**హన్మకొండ, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** బాలసముద్రం లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి కార్య క్రమాన్ని నిర్వహించారు. మొదట సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ. భారతదేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి తల్లి సావిత్రిబాయి పూలే అని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి అని కొనియాడారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన మహనీయు రాలు అని తెలిపారు. కార్య క్రమంలో సీనియర్ నాయకులు సల్వాజీ రవీందర్ రావు, నయీముద్దీన్, బుద్దె వెంకన్న, మహమూద్ గౌస్ ఖాన్, సౌరం రఘు, సంపతి రఘు, తక్కళ్లపల్లి వినీల్ రావు, సూరసి మహేష్, దరిగి రమేష్, గద్దెపాటి సాయి కుమార్, సల్మాన్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవోద్యమ నేత సావిత్రిబాయి పూలే

**బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి**




**హన్మకొండ, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో ప్రజలందరికీ విద్య అందాలని అప్పుడే గౌరవ ప్రదంగా జీవించడానికి అవకాశం ఉంటుందని మహాత్మ జ్యోతిరావు పూలే తన సహచరురాలిని సావిత్రిబాయి పూలే కు విద్య నేర్పించి అందరికీ విద్య బోధించాలని మహిళా చైతన్యమే జన చైతన్యమని వితంతువులకు మహిళలకు దళితులకు బహుజనులకు శుద్ర అతిశూద్రుల కు నాటి సమాజం నిరాకరించిన విద్యను అందించి సామాజిక విప్లవోద్యమ నేతగా సావిత్రిబాయి పూలే నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని నేదునూరి రాజమౌళి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి తెలిపారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి 195వ వ జయంతిని పురస్కరించుకొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. నాటి సామాజిక వ్యవస్థ సనాతన ధర్మం పేరుతో మహిళలకు శూద్రులకు అతిశూద్రులకు విద్య ఉద్యోగం నిరాకరించడాన్ని సావిత్రిబాయి పూలే ధైర్యంగా ఎదుర్కొని అందరికీ విద్యను అందించిన దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలని తెలిపారు. దొమ్మాటి ప్రవీణ్ కుమార్ భారత్ బచావో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మూఢ విశ్వాసాల పై కుల వివక్షత పై అక్షరాయుధము తో మనువాద సమాజాన్ని చీల్చి చెండాడిన వీర వనిత అని పేర్కొన్నారు. నేటి సామాజిక రుగ్మతల పై పోరాడటమే సావిత్రిబాయి పూలే కు అర్పించే నిజమైన నివాళులు అన్నారు ఈ కార్యక్రమంలో కాసర బోయిన రవితేజ వేల్పుల ప్రభాకర్ దుస్స వెంకటేశ్వర్లు నాగరాజు కుమార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించండి**

**ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి ఉండాలి: కాంగ్రెస్ నాయకులు ఉబ్బన రాంబాబు**





**కల్లూరు, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్)** :తెలంగాణ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఉబ్బన రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఉబ్బన రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ నగర్ నందు ప్రాథమిక పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు నోట్స్ బుక్స్, పెన్నులు అందజేయడం వలన ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు సేవాగుణముతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. పిల్లలు కష్టపడి చదివి ప్రయోజకులుగా మారాలని తల్లిదండ్రులకు, సొంత గ్రామానికి మంచి పేరు తెచ్చే విధంగా మంచి ప్రవర్తన కలిగి మెలగాలని కోరారు. పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సరైన విద్య అందే విధంగా చూడాలని వారిని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ కాంగ్రెస్ నాయకులు బైర్ల కాంతారావు, వేము దినాకర్, ఉబ్బన రాజా, కిష్టయ్య బంజర కాంగ్రెస్ నాయకులు జంగం నరసింహారావు, శాంతినగర్ నాయకులు కొత్తపల్లి వీరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జేఈఈ నీట్‌లో రామంతాపూర్ శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభకు సన్మానం





**ఉప్పల్ డిసెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్)** :దేశ వ్యాప్తంగా నిర్వహించే జేఈఈ అడ్వాన్స్, నీట్ పరీక్షల్లో శ్రీ చైతన్య స్కూల్ రామంతాపూర్ బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ ప్రతిభతో విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారని విద్యావేత్తలు ప్రశంసించారు. ప్రతిభ చూపిన పూర్వ విద్యార్థులను శనివారం పాఠ శాలకు ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణగూడ జోన్ ఏ.జి.యం. నూర్ మహమ్మద్ అలి ప్రతిభ కనపరిచిన డి. కార్తికేయ ఐ.ఐ.టి పాట్నా,వి. దినాకర్ ఐ.ఐ.ఐ.టి గౌహతి, కె. హృతిక్ యం.బి.బి.యస్ గాంధీ, సంతోష్ రెడ్డి నీట్ చెన్నై ,యన్. అనురూప్ రెడ్డి ఐ.ఐ.ఐ.టి శ్రీ సిటీ చిత్తూర్,హిరణ్ మయి ముత్యాల ఐ.ఐ.టి శ్రీసిటి చిత్తూర్, యన్. లోకేష్ రెడ్డి ఐ.ఐ.టి మండి,ఏ. నితీష్ యన్.ఐ.టి. రుర్కెల విద్యార్థులను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువు కుంటే మంచి భవిష్యత్తును నిర్మించుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు సైతం సరైన మార్గ దర్శకులుగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఇంచార్జ్ బి.వెంకటేశ్, జోనల్ అకాడమిక్ కో ఆర్డినేటర్స్ సి.మెచ్. పుల్లారావు, రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు భాగ్య లక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ శ్రీ కీర్తి కోన, డీన్ నాగరాజు, ఐ.పి.యల్.సి.బ్యాచ్ ఇంచార్జులు వెంకటేశ్ గుప్త, అరుణ్ కుమార్ మరియు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి నూతన వ్యవసాయ పద్ధతులు డ్రోన్స్ షాప్ ప్రారంభోత్సవం:ఐడిసి చైర్మెన్ మువ్వా










**వేంసూర్, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్)** :మర్లపాడు గ్రామంలో అనువైన వ్యవసాయం కోసం రవి బాబు నూతనంగా ఏర్పాటుచేసిన ధరణి ఏరోటెక్ వ్యవసాయ డ్రోన్ షాప్ ను ఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మువ్వ డ్రోన్స్ ను ఆసక్తిగా తిలకించి, సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు నూతన వ్యవసాయ పద్ధతులు అందుబాటులోకి తీసుకు వచ్చినందుకు గాను యజమానులకు కృతజ్ఞతలు తెలియచేసినారు. అనంతరం భీమవరం గ్రామంలో తోట ధర్మ, వంటల రవిని మువ్వా పరామర్శించినారు. ఇటీవల కాలంలో వారు అనారోగ్యంకు గురికాగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సదాశివునిపాలెం గ్రామమునకు చెందిన మువ్వా అభిమానులు మువ్వా క్యాంపు ఆఫీస్ (వాటర్ ప్లాంట్) సత్తుపల్లి నందు మర్యాదపూర్వకంగా చైర్మన్ మువ్వా విజయ్ బాబు కలుసుకొని పుష్పగుచ్ఛంతో సన్మానించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొనడం జరిగింది.

# గ్రామ అభివృద్ధి కోసం అంకిత భావంతో పని చేయాలి: గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్





**తల్లాడ, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్)** :గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేయాలని గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అన్నారు. శనివారంమండల పరిధిలో అన్నారుగూడెం గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అధ్యక్షతన శనివారం గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో గ్రామసభ నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామసభ నందు పాలకమండలి, అధికారుల పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం గ్రామాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, విద్యుత్, మంచినీటి సౌకర్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రామ శ్రేయస్సుకై పైన చర్చించిన విషయాలపై అంకితభావంతో పనిచేయాలని, దీనికి పాలకమండలి సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రాతినిధ్య వార్డుల్లో ప్రతి విషయంపై అవగాహన కలిగి ఆయా వార్డుల సమగ్రాభివృద్ధికై పాటుపడాలని అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరిని సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వరరావు,వార్డు సభ్యులు, పంచాయితీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



**హైదరాబాద్ డిసెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్)**:ది జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ జూబ్లీహిల్స్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు గోపరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఉపాధ్యక్షుడు ఎం. లక్ష్మి నారాయణ, కార్య దర్శి రవీంద్ర బాబు, సంయుక్త కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి మహేశ్వర్ గౌడ్, డైరెక్టర్ కమలాకర చారి పాల్గొన్నారు.

# ఆనందగిరి సుందర ధర్మశాస్త్ర దేవాలయంలో గణపతి హోమం,సహస్ర గంటాభిషేకం , మహా పడిపూజ







**గంగాధర జనవరి (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో ఈరోజు ఆనంద్ గిరి సుందర ధర్మశాస్త్ర ఆలయంలో ఆలయ ధర్మకర్త శ్రీరామ్ శ్వేతా,మధుకర్, శ్రీరామ్ మహాలక్ష్మి గార్లచే గణపతి హోమము మరియు సహస్ర ఘంటాభిషేకం మరియు మహా పండి పూజ డాక్టర్ బ్రహ్మశ్రీ తిరుపతి చంద్రమౌళి, వెంకటేశ్వర శర్మ,గణాపాటి చందు శర్మ స్వామి,జీకే గురు స్వామి,వివేక్ శుక్లనరేందర్ స్వామి. గార్లచే అంగరంగ వైభవంగా జరిపినారు ఇట్టి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.

# చైర్మన్ మువ్వాను కలిసిన సర్పంచ్ పగడాల రమాదేవి

**● ప్రజల క్షేమం గ్రామాభివృద్ధి కోసం పనిచేయండి: ఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు**





**సత్తుపల్లి, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల క్షేమంకోసం గ్రామ అభివృద్ధికోసం నిరంతరం సేవకులుగా పనిచేయాలని ఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు అన్నారు. శనివారం సత్తుపల్లి పట్టణంలో మువ్వా క్యాంపు ఆఫీస్ (వాటర్ ప్లాంట్) నందు దమ్మపేట గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి మర్యాదపూర్వకంగా తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు కలిసినారు. ఈ సందర్భంగా చైర్మన్ మువ్వా ను దమ్మపేట కాంగ్రెస్ పార్టీ నూతన సర్పంచ్ పగడాల రమాదేవి వైస్ ప్రెసిడెంట్ అంగోతు శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించినారు. ఈ సందర్భంగా ఐడిసి చైర్మన్ మువ్వా విజయ్ బాబు మాట్లాడుతూ.. సర్పంచ్ కు ఉపసర్పంచ్ కు పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని తెలియచేయడం జరిగినది. అన్ని విధాల మా సహకారాలు ఎప్పుడు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ప్రజల సంక్షేమ కోసం సేవకులుగా మారి ప్రజల మన్నలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా, జారే అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ నియామకం



**హైదరాబాద్ డిసెంబర్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ ని రాష్ట్ర అధ్యక్షుడు అనంచిన్ని వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జర్నలిస్టులుఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘం తరఫున ముందుండి కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి రాష్ట్ర అధ్యక్షుడికి, ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణకి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, సభ్యుల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి జర్నలిస్టులకు అండగా నిలబడతానని ఆయన పేర్కొన్నారు. ఈ నియామక కార్యక్రమంలో సంఘానికి చెందిన పలువురు నాయకులు, సభ్యులు పాల్గొని ఖమ్మంపాటి సాయిచందర్ గౌడ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి కీర్తి సంతోష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించిన దళిత విద్యార్థి సంఘం



**రామడుగు జనవరి 03(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని దళిత విద్యార్థి సంఘం (డీవీఎస్) ఆధ్వర్యంలో గోపాల్ రావుపేట ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం డివిఎస్ మండల అధ్యక్షులు అరెల్లి రాజశేఖర్ నేతృత్వంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, నాయకులు సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రలోని ముఖ్య సంఘటనలను విద్యార్థులకు వివరించారు. మహిళా విద్య, సామాజిక సంస్కరణల కోసం ఆమె చేసిన సేవలు ఆదర్శనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి నరేందర్ రెడ్డి, డివిఎస్ జిల్లా ఇన్చార్జి రేనుకుంట బాపు రాజ్, మిర్యాల సంజయ్, కళ్లెపెల్లి అంజయ్య, కనకం వెంకటేష్, దాసరి బాబు, బానాల కిట్టు, కుమార్ సంజీవ్, దత్తు, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల ఐకమత్యమే మహాబలం

**- గ్రామీణ వైద్యుల సేవా, సంక్షేమమే ధ్యేయం**

**- హక్కుల సాధనకోసం గ్రామీణ వైద్యులు రాజకీయంగా ఎదగాలి**

**- తెలంగాణ గ్రామీణ వైద్యుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సలీం, జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ రామారావు**

**- ఘనంగా తెలంగాణ గ్రామీణ వైద్యుల సేవా సంఘం 4వ మహాసభ**









**ఖమ్మం ప్రతినిధి, జనవరి 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రామీణ వైద్యుల ఐకమత్యమే మహాబలం అని, గ్రామీణ వైద్యుల సేవా, సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ గ్రామీణ వైద్యుల సేవా సంఘం ఏర్పడిందని, వారి హక్కుల సాధనకోసం గ్రామీణ వైద్యులు రాజకీయంగా ఎదగాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సలీం, జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ రామారావు లు అన్నారు. ఖమ్మం నగరంలోని గోపాలపురం జిఆర్ఆర్ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ గ్రామీణ వైద్యుల సేవా సంఘం ఖమ్మం జిల్లా నాలుగో మహాసభ శనివారం ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ మండలాల గ్రామీణ వైద్యులు, సంఘ నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్ను ఆవిష్కరించి గ్రామీణ వైద్యులను శాలువాలతో సత్కరించారు. గ్రామీణ వైద్యులపై దాడులు శోచనీయం :సమావేశంలో మాట్లాడిన నాయకులు గ్రామీణ వైద్యులపై టీఎంసీ చేస్తున్న దాడులను ముక్తకంఠంతో ఖండించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులను వేధించడం సరికాదన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి గుర్తింపు కార్డులు అందించినట్లే ప్రస్తుతం కూడా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. యూనియన్ నిబంధనలకు లోబడి పరిధిని మించి వైద్యం చేయకుండా బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులపై చిన్నచూపు చూడటం అన్యాయమన్నారు. ఐక్యతతోనే హక్కుల సాధన-- రాజకీయ గుర్తింపు అవసరంగ్రామీణ వైద్యులు ఎంత ఐక్యంగా ఉంటే అంత బలంగా నిలబడగలమని నాయకులు స్పష్టం చేశారు. గ్రామీణ వైద్యుల సేవ ఇంటింటికి చేరుతుందని, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ఈ వర్గం రాజకీయంగానూ గుర్తింపు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో గెలుపు ఓటములను శాసించే శక్తి గ్రామీణ వైద్యులకూ ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఎమ్మెల్యే స్థాయి ఎన్నికల్లోనూ పోటీ చేసి గెలవాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ ఆసుపత్రుల అవకాశవాద ధోరణితో గ్రామీణ వైద్యుల సేవలు ప్రథమ చికిత్సకే పరిమితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టపరమైన రక్షణకు హామీ ఇస్తూ డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఐకమత్యంతో పోరాటం చేస్తేనే హక్కులను కాపాడుకోగలమన్నారు. గ్రామీణ వైద్యులు ఫస్ట్ ఎయిడ్ వరకు మాత్రమే చేసి, మిగతా వైద్యం కోసం ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు. దిశ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ న్యాయవాది మేకల సుగుణరావు మాట్లాడుతూ... గ్రామీణ వైద్యుల సేవలు పేద ప్రజలకు అమూల్యమన్నారు. గ్రామీణ వైద్యులపై అక్రమ కేసులు, దాడులు జరిగితే ఉచితంగా న్యాయపోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. జీవో 428, 429, ఎన్ఎంసీ యాక్ట్, టీఎంసీ నిబంధనలకు లోబడి ధైర్యంగా సేవలు అందించాలని సూచించారు. ఈ మహాసభలో పలు కీలక తీర్మానాలు చేసి, సంఘం ఆవిర్భవించి జనవరి 3, 2026 నాటికి 650 నుంచి వెయ్యి మంది సభ్యులతో బలంగా ఎదుగుతోందని నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఇదే రోజున మహనీయురాలు సావిత్రిబాయి పూలే జయంతి రోజు కావడం సంఘం ఎదుగుదలకు శుభసూచకమని సూచించారు. సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. . ఈ కార్యక్రమంలో పలు తీర్మానాలు చేయడంతో పాటు 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించి, గ్రామీణ వైద్యులకు శతస్కోపును, క్యాలెండర్ ను అందించారు. ఈ సమావేశంలోముఖ్య అతిథులుగా తెలంగాణ గ్రామీణ వైద్యుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ సలీం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకపోతుల లాలేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది మేకల సుగుణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజబోయిన ప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కేమలక్ష్మి మణి, రాష్ట్ర సాంస్కృతిక అధ్యక్షులు షేక్ ఫక్రుద్దీన్, రాష్ట్ర కోశాధికారి షేక్ రహీం,

జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు తాళ్లూరి జ్యోతి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దనిశెట్టి లక్ష్మయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేశవపట్నం వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవ అధ్యక్షులు రొంటెం రామలింగం, బహుజన కులాల చైర్మన్ డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్, ఖమ్మం నగర ప్రముఖులు రొంపిచర్ల శ్రీనివా సులు, శీలం నర్సిరెడ్డి, జిల్లా గౌరవ సలహాదారు దేవర కొండ నాగభూషణం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తుప్ప తి ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గుత్తికొండ నాగభూషణం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మందా రాము, జిల్లా కోశాధికారి గన్నవరపు రాజాచారి, మధిర డివిజన్ అధ్యక్షులు కుక్కల నాగేశ్వరరావు, కొని జర్ల మండల అధ్యక్షులు షేక్ సలీం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాల బాధ్యులు హాజరయ్యారు.

# ఓం శ్రీ యంగల్ కులదైవమే శరణమయ్యప్ప అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసిన ఎమ్మెల్సి నవీన్ రెడ్డి



**షాద్ నగర్, జనవరి 03(పిసిడబ్ల్యూ న్యూస్):** షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమని వైభవంగా ఏర్పాటు చేశారు,గౌరవ శాసనమండలి సభ్యులు నాగరకుంట నవీన్ రెడ్డి. ఈ అన్న ప్రసాద కార్యక్రమానికి మొదల్లగూడ మాజీ సర్పంచ్ శ్రీమతి నాగరకుంట ఉమా ప్రవీణ్ కుమార్ రెడ్డి దంపతులు హాజరై అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సి నవీన్ రెడ్డి కుటుంబసభ్యుల తో పాటు పిన్ గౌడ్,మధుసూదన్ రెడ్డి,కాట సుదీర్,ఆవుల శ్రీకాంత్,సాయి వరుణ్,స్వాతి గ్రాఫిక్స్ నరేందర్,ఏదేలిశ్రీను, మరియు శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరం అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, కార్యదర్శి రేటికల్ నందీశ్వర్,కోశాధికారి దాస క్రిష్ణయ్య,చింటూ ( ప్రతాప్ రెడ్డి ),అంతటి కోటిలింగం స్వామి,ఎలగని వెంకటేష్ గౌడ్ స్వామి,రేణుకుంట్ల రాజేష్ స్వామి,ాంవ్ శ్రీను స్వామి,గోలేపు రాఘవేందర్. చరణ్,కీర్తన్ రెడ్డిస్వామి,ప్రణయ్ స్వామి,నరేష్ స్వామి,కార్తీక్ స్వామి,రవి గౌడ్ స్వామి, గడ్డమిది జంగయ్య,పాండు,నగేష్,మేనేజర్ రాజగోపాల్,తదితర అయ్యప్ప భక్తులు,స్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు. **స్వాములకు ఇరుముడులు** ఆలయంలో అయ్యప్ప స్వాములకు ఇరుముడులు కట్టడం జరిగింది. శ్రీ పందల రాజ కుమారుని దర్శనానికి ప్రయాణించేలా శ్రీశ్రీశ్రీ గిరీష్ సతీషన్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యములో నిర్వహించారు, స్వాములు విజయ్ స్వామి,రాజేష్ స్వామి, అరుణ్ స్వామి, శ్రీకాంత్ స్వామి,బాబు స్వామి,శబరిమలకు ప్రయాణమయ్యారు.






# మన శంకరవరప్రసాద్ గారు పోస్టర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.

# కన్నడనాట 'మార్క్' సెన్సేషన్.. బాక్సాఫీస్ వద్ద 'క్వీన్ ఆఫ్ మార్క్' దీప్శిఖ చంద్రన్ హవా!

ప్రస్తుతం కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో 'మార్క్' సినిమా బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటూ అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. ఈ సినిమా సాధిస్తున్న భారీ విజయంలో హీరోయిన్ దీప్శిఖ చంద్రన్ పోషించిన పాత్ర అత్యంత కీలకంగా నిలిచింది.ప్రేక్షకుల మనసు గెలిచిన దీప్శిఖసినిమా చూసిన ప్రేక్షకులు దీప్శిఖ చంద్రన్ నటనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా ఆమె అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్, నటన చూసి థియేటర్లలో ఈలలు, చప్పట్లతో హోరెత్తిస్తున్నారు. సాధారణంగా యాక్షన్ సినిమాల్లో హీరోయిన్ల ప్రాధాన్యత తక్కువగా ఉంటుందనే వాదనను చెరిపివేస్తూ, దీప్శిఖ తన నటనతో సినిమాకు పెద్ద ఎసెట్‌గా నిలిచారు. ఈ సినిమాలో దీప్శిఖ చేసిన యాక్షన్ బ్లాక్స్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, రిస్కీ స్టంట్స్ మరియు పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో మెప్పించడంతో సోషల్ మీడియాలో ఆమెను "మార్క్ క్వీన్", "క్వీన్ ఆఫ్ మార్క్" అంటూ నెటిజన్లు ఆకాశానికెత్తుతున్నారు.పాజిటివ్ మౌత్ టాక్‌తో కన్నడ మార్కెట్‌లో 'మార్క్' బ్లాక్‌బస్టర్‌గా దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన విజయం దీప్శిఖ చంద్రన్ కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోనుంది. ఆమెకు పెరుగుతున్న ఈ ఆదరణను చూస్తుంటే, రానున్న రోజుల్లో ఆమె మరిన్ని భారీ ప్రాజెక్టులలో కనిపించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, 'మార్క్' సినిమాతో దీప్శిఖ చంద్రన్ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకొని కన్నడ ప్రేక్షకులకు కొత్త క్రష్‌గా మారిపోయారు.



# నటనపై ఆసక్తి లేదన్న దర్శకుడు

## అలాంటి గ్రాప్‌లో పడనన్న అనిల్ రావిపూడి

ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోలు కావాలనుకుని ఇండస్ట్రీకి వచ్చి దర్శకులుగా స్థిరపడినవారు ఉన్నట్లే, దర్శకత్వ రంగంలోకి వచ్చి హీరోలుగా మారిన ఉదాహరణలూ ఉన్నాయి. నాని, రాజ్ తరుణ్ లాంటి వారు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేసి తర్వాత హీరోలుగా సక్సెస్ సాధించారు. మరోవైపు కొందరు సక్సెస్‌ఫుల్ దర్శకులు కూడా హీరోగా మారాలని ప్రయత్నించి ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో టాలీవుడ్‌లో వరుస హిట్లతో దూసుకెళ్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి హీరోగా మారతారా? అన్న ప్రశ్న తరచూ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన స్టేజ్‌పై మాట్లాడే తీరు, కామెడీ టైమింగ్, మాస్ పల్స్ చూసి 'హీరో మెటీరియల్' అంటూ అభిమానులు కామెంట్స్ చేయడం కొత్త కాదు. అయితే ఈ విషయంపై అనిల్ రావిపూడి ఇచ్చిన సమాధానం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హీరోగా సినిమా



చేయొచ్చుకదా అని అడిగినప్పుడు అనిల్ రావిపూడి చాలా మెచ్యూర్డ్‌గా స్పందించారు. మనమొక క్రాఫ్ట్‌లో టాప్‌లో ఉన్నప్పుడు పక్కదారి పట్టించడానికి ఇలాంటి ప్రలోభాలు వస్తాయి. వాటికి లొంగితే ఇప్పటికే ఉన్న కెరీర్‌కే ప్రమాదం. అందుకే ఆ ట్రాప్‌లో నేను పడను. నాకు హీరోగా మారాలనే ఉద్దేశం ఏమాత్రం లేదు. డైరెక్షన్‌పైనే పూర్తి దృష్టి పెడతాను అని ఆయన స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తుంది. టాలీవుడ్‌లో దర్శకుడు రాజమౌళి తర్వాత ఫెయిల్యూర్ లేని ట్రాక్ రికార్డ్ ఉన్న డైరెక్టర్‌గా అనిల్ రావిపూడికి మంచి పేరు ఉంది. ఆ రికార్డును కాపాడుకోవడమే తన ప్రధాన లక్ష్యమని, నటన వైపు వెళ్లి ఫోకస్ డైవర్ట్ చేయాలనే ఆలోచన తనకు లేదని ఆయన మరోసారి క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి పూర్తిగా మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాపైనే దృష్టి పెట్టారు.

# విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిల కాంబో

## గాంధీ టాక్స్ ..మూకీ డ్రామా

భారతీయ చలనచిత్ర తెరపై దశాబ్దాల తర్వాత మళ్ళీ ఒక అద్భుత ప్రయోగం ఆవిష్కృతం కాబోతోంది. అప్పట్లో కమల్ హాసన్ నటించిన 'పుష్పక విమానం' వంటి మూకీ సినిమా ప్రేక్షకులను ఏ విధంగా మంత్రముగ్ధులను చేసిందో మనందరికీ తెలిసిందే. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత, అదే స్థాయిలో భావోద్వేగాలను పండించడానికి 'గాంధీ టాక్స్' అనే మూకీ డ్రామా సిద్ధమైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించబోతున్నారు. ఈ సినిమాలో మాటలు లేకపోయినా, కేవలం నటీనటుల హావభావాలు మరియు సంగీతంతోనే కథను ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు.ప్రముఖ నిర్మాణ సంస్థ 'జీ స్టూడియోస్' ఈ చిత్రాన్ని గాంధీజీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇది మూకీ సినిమా అయినప్పటికీ.. తెలుగు, తమిళం, హిందీ, మరాఠీ మరియు మలయాళ భాషల్లో టైటిల్ కార్డులు, ప్రమోషన్లతో గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిలతో పాటు అందాల నటి అదితి రావు హైదరి, మరాఠీ నటుడు సిద్దార్థ్ జాదవ్ కీలక పాత్రల్లో నటించారు. మాటలు లేని ఈ సినిమాలో సంగీతమే ప్రాణం. అందుకే ఈ చిత్రానికి ఆస్కార్ విజేత, మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ అద్భుతమైన స్వరాలను అందిస్తున్నాడు. కిషోర్ పి. బేలేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉమేష్ కుమార్ బన్సల్, రాజేష్ కేజ్రీవాల్, మీరా చోప్రా, కిషోర్ పాండురంగ్ బేలేకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# రజనీతో కమల్ మూవీ



## - డైరెక్టర్‌గా శిబి చక్రవర్తి

అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని రాసుకొచ్చింది. కమల్ సొంత నిర్మాణసంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అంతకుముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు. దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.